క్లుప్తంగా

గణపతి లడ్డూ @ రూ.85,116

నేలకొండపల్లి: మండలంలోని రాజారాంపేటలో వినాయక మండపం వద్ద బుధవారం లడ్డూ పాట నిర్వహించగా.. గ్రామానికి చెందిన గోనెల ఉపేందర్‌రావు రూ.85,116లకు దక్కించుకున్నారు. అదే విధంగా నవరాత్రుల పూజించిన పెన్ను వేలంపాటలో గ్రామానికి చెందిన నాగ వైష్ణవి రూ.21,000లకు పాడారు.

ఉచిత వైద్య శిబిరం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని స్తంభాద్రి ఆస్పత్రిలో విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన విశ్రాంత పోలీస్ అధికారులకు రెండో విడత హృద్రోగ సంబంధిత ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణుడు పేర్ల హర్షతేజ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అదనపు ఎస్పీలు సాధుప్రతాప్‌రెడ్డి, ఆర్.సాయిబాబా, సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణమూర్తి, రుద్రవెంకటనారయణ పాల్గొన్నారు.

రుణమాఫీ కుటుంబ నిర్ధారణ ప్రక్రియ

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామంలో రుణమాఫీ కుటుంబ నిర్ధారణ కాని కుటుంబాల నమోదు కార్యక్రమాన్ని బుధవారం కూసుమంచి ఏడీఏ సరిత పరిశీలించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యాన చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ఇందుకు రైతులు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ నారెడ్డి సీతారాంరెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన

నేలకొండపల్లి: ఓటర్ల జాబితాపై మండలంలోని కోనాయిగూడెంలో జరుగుతున్న ఇంటింటా సర్వేను బుధవారం తహసీల్దార్ జాదవ్ మానిక్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పలు పంచాయతీల్లో చేపడుతున్న ఇంటింటి సర్వేలో జాప్యం చేస్తే బీఎల్‌ఓలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూరు శాతం పక్కాగా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయాలి



వ్యాక్సినేషన్ గదిని పరిశీలిస్తున్న డీఐఓ

కామేపల్లి: గర్భిణులు, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చందునాయక్ అన్నారు. బుధవారం కామేపల్లి పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వ్యాక్సిన్ డిస్ట్రిబ్యూషన్ రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని సబ్ సెంటర్లలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండి వ్యాక్సిన్లు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నెల్లూరి చందన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'భగీరథ' నీటి వినియోగంపై అవగాహన

కామేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి నమూనాలను నీటి నాణ్యత పరీక్షా కేంద్రం శాంపిల్ సేకరణ ప్రతినిధి షేక్ జానీపాషా సేకరించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ నీటి వినియోగం వలన కలిగే ప్రయోజనాలను వివరించి ఆయా గ్రామస్తులను చైతన్య పరిచారు. మాస్టర్ రిసోర్స్ పర్సన్ చిలుముల రమేష్, కార్యదర్శి నాగలక్ష్మి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్ పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు వారి కుటుంబసభ్యుల ద్వారా 40 జతల క్రీడా దుస్తులను బుధవారం అందించారు. ఈక్రమంలో పాఠశాల టీచర్ స్నేహలత ఆమె కుమారుడు స్నేహిత్ ద్వారా 25 జతలు, మరో టీచర్ నాగశ్రీ వారి నాన్న రాధాకృష్ణ ద్వారా 15 జతలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కె.మంజుల మాట్లాడి టీచర్లను అభినందించారు.

మార్కెట్‌లో స్వచ్ఛతా హీ సేవా

ఖమ్మంమయూరిసెంటర్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్– నాన్‌వెజ్ మార్కెట్‌లో బుధవారం అసిస్టెంట్ కమిషనర్‌తో పాటు మార్కెట్ కమిటీ సభ్యులు, ఈఈ, పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి చెత్తను శుభ్రం చేశారు. అలాగే శాంతినగర్ పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలో నమోదు కాని వారి కోసం..

వరదల తర్వాత ప్రభుత్వ సాయం అందించేందుకు అధికారులు ఇంటింటి సర్వే చేయించారు. ఆ సమయాన కొందరు బాధితులు ఇంటి వద్ద లేకపోవడంతో కేఎంసీలో అందించేందుకు బారులుదీరారు. దీంతో ఆలస్యం చేయకుండా దరఖాస్తులను స్వీకరించాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. అంతేకాక బాధితులకు భరోసా కల్పించేలా అధికారులు సమాధానాలు చెప్పాలని ఆదేశాలు జారీ చేయడంతో ప్రతి ఒక్కరి సమస్యను వింటూ ఈ నెల 20 నుంచి 22వ తేదీ కల్లా ప్రభుత్వ సాయం అందుతుందని వివరిస్తున్నారు.



వేలి ముద్ర వేయించేందుకు ఇంకు రాస్తున్న దృశ్యం

వరదలా దరఖాస్తులు..

లబ్ధిదారులతో కిక్కిరిసిన కేఎంసీ

- వరద బాధితులు, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ కోసం రాక
- దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు
- 22లోగా అర్హులందరికీ ప్రభుత్వ సాయం
- కొనసాగిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



ప్రజాపాలన పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు



దరఖాస్తు చేసేందుకు వచ్చిన జనం

ఖమ్మంమయూరిసెంటర్: వరదలతో ఇళ్లు మునిగాయని, ప్రభుత్వ సాయం అందలేదని కొందరు బాధితులు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి పోటెత్తారు. ఇలా వరద బాధితులు, ప్రజాపాలన దరఖాస్తుదారులు (ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్) లబ్ధిదారులు బుధవారం ఒక్కసారిగా రావడంతో కార్యాలయ ఆవరణమంతా కిక్కిరిసిపోయింది. వందలాది మంది రావడంతో అధికారులు అప్రమత్తమై ప్రజలకు పౌర సేవలు అందించేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రజాపాలన దరఖాస్తు కేంద్రం వద్దకు చేరుకొని సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వం నుంచి సాయం అందనివారికోసం ప్రత్యేకంగా నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయించి బాధితుల వివరాలను సరిచేయించారు. ఇక ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగేలా సిబ్బందికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయించారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..



సర్వే సమయాన ఇంటి వద్ద లేని బాధితుల కోసం కేఎంసీలో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. సర్వేలో వివరాలు చెప్పినా.. సాయం అందలేని వారి వివరాలను సరి చేయిస్తున్నాం. రెండు మూడు రోజుల్లో బాధితులందరికీ సాయం అందుతుంది. ప్రజాపాలన దరఖాస్తులు ప్రారంభించాం. రేషన్ కార్డుల కోసం వచ్చే దరఖాస్తులను కూడా స్వీకరిస్తున్నాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్: పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా సివిల్ సప్లైలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు వేతనాలు పెంచాలని ప్రగతి శీల హమాలీ అండ్ మిల్‌వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగమతులు, దిగుమతులకు క్వింటాకు రూ.35 ఇవ్వాలని ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, సివిల్ సప్లయీస్ అధికారులు తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. హమాలి కార్మికుల వేతన ఒప్పందం 2024 జనవరిలో ముగిసిందని అప్పటినుంచి ఇప్పటివరకు వేతన ఒప్పందాల గురించి అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం లేక ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, శాశ్వత గోడౌన్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమావేశంలో ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కె.పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, హమాలీ బ్రాంచ్ కమిటీ నాయకులు రామరాజు, భానోత్ రవి, నాగరాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

నేలకొండపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రావెళ్ల భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్షతో పాటుతులం బంగారం కూడా అందించాలని, రూ.2,500 ఆర్థిక సాయం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోగా.. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బలుసు ప్రమీలా, మందుల స్రవంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బండి పద్మ, సుమతి, ప్రభావతి, బెల్లం లక్ష్మి, మున్నంగి లక్ష్మి, ముంజుల, వాణి పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం



ప్రమాణ స్వీకారం చేసిన విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో నిర్వహించిన మాక్ పోలింగ్‌లో విజేతలైన విద్యార్థుల ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్‌పీఎల్)గా జి.సుభాష్‌చంద్ర, హోమ్, ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీగా ఎ.లక్ష్మీనక్షత్ర, ఏఎస్‌పీఎల్‌గా ఎ.విశ్వతేజ్‌లతో పాటు వివిధ విభాగాల్లో గెలుపొందిన వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో క్రెస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, ప్రముఖ పిల్లల వైద్యురాలు యలమంచిలి నాగమణి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.


వీవీపాలెంలో మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు ఈ నెల 20, 21వ తేదీల్లో మండలంలోని వీవీపాలెం పాఠశాలలో జరుగుతాయని క్రీడా పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి పీడీ కళ్యాణపు ఆదర్శ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి పోటీలు నిర్వహించనుండగా.. అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ పాఠశాలలకు చెందిన బాలబాలికలు అర్హులన్నారు. ఆసక్తి గల వారు గురువారం (నేడు) సాయంత్రం 5 గంటలలోపు తమ ఎంట్రీలను సమర్పించాలని, మరిన్ని వివరాలు కోసం 99896 47696 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: కొత్తగూడెంలో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించే ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్–వర్కర్స్ యూనియన్ మూడో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ మాజీ జాతీయ సమితి సభ్యుడు పోటు ప్రసాద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో రాష్ట్ర 3వ మహాసభల పోస్టర్‌ను ఆయన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ..ఆటో కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని, అందుకు కార్మికులంతా ఏక తాటిపైకి వచ్చి వారి హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రావి శివరామకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ జాకీరుద్దీన్, పేరబోయిన మోహన్‌రావు, నాయకులు రావుల శ్రీనివాస్, టేకుమట్ల శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న ఎర్రా శ్రీనివాసరావు

తిరుమలాయపాలెం: రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎర్ర శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌సాయిపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, అందుకే ప్రజలు ఉద్యమాల ద్వారా సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, దాసరి మహేందర్, ఆనందరావు, భూక్యా వెంకన్న, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలియం డీలర్‌ను ఆదుకోవాలని వినతి



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: వరద బీభత్సంతో నష్టపోయిన నాయకులగూడెం పెట్రోల్ బంక్(ఎన్ ఎస్‌ఎల్‌వీ ఆటో సర్వీసెస్) డీలర్‌ను ఆదుకోవాలని పెట్రోలియం డీలర్ల అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు బుధవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు విన్నవించారు. ఇంధన ట్యాంకులు కొట్టుకుపోగా, బంక్ ధ్వంసమైందని వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరప్రగఢ రంగనాథ్, కూరపాటి మంజులతో పాటు బాధ్యులు పాల్గొన్నారు.

చిప్స్ తిన్న చిన్నారికి అస్వస్థత

నేలకొండపల్లి: కాలం చెల్లిన చిప్స్ తినడంతో చిన్నారి అస్వస్థతకు గురయ్యాడు. మండలంలోని భైరవునిపల్లికి చెందిన పర్వత అనిల్ బదేళ్ల కుమారుడు ఆదినారాయణ సోమవారం స్థానిక కిరాణ షాపులో చిప్స్ ప్యాకెట్ కొనుగోలు చేసి తిన్నాడు. ఆతర్వాత వాంతులు, విరోచనాలు మొదలుకావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాలం చెల్లిన చిప్స్‌తోనే ఈ ఘటన చోటు చేసుకుందని అనిల్ ఆరోపించారు.

చోరీకి యత్నం..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో బుధవారం రోడ్డుపై పార్కింగ్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని దొంగ కావాలనే పడేసి.. పక్కనే ఉన్న వెంకటనారాయణ అనే వ్యక్తిని బైక్ లేపేందుకు రమ్మని పిలిచాడు. దీంతో బైక్ వద్దకు వచ్చి సాయం చేస్తుండగా.. మరో దొంగ వెనక నుంచి వచ్చి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించే ప్రయత్నం చేయగా.. సదరు వ్యక్తి కేకలు వేయడం మరొకరు బైక్‌పై వచ్చి చోరీ చేయబోయిన వ్యక్తులను తీసుకెళ్లారు. స్థానికులు వెంట పడినా లాభంలేకుండా పోయింది.

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని మండపం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ నేపథ్యాన విజయ్‌పాల్ అనే వ్యక్తితో గ్రామానికి చెందిన మరో ముగ్గురు ఘర్షణ పడి దాడి చేయడంతో గాయాలపాలయ్యాడు. దీంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సి గాయపరిచారు. బాధితుడు స్థానిక పోలీసులను ఆశ్రయించగా.. విచారణ చేపట్టినట్లు ఎస్సై పి.సంతోష్ తెలిపారు.

పాఠశాలలో మద్యం సీసాలు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కొందరు మందుబాబులకు అడ్డాగా మారింది. ఎక్సైజ్ కార్యాలయం పక్కనే ఉన్న పాఠశాలలో రాత్రయితే చాలు పలువురు చేరి మందు తాగడమే కాక సీసాలు పగలగొడుతున్నారు. ఈ విషయమై హెచ్‌ఎం జి.రమేష్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వరద బాధితులకు చేయూత..

☞ ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదల్లో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబాలకు చెందిన మానసిక వికలాంగుల పిల్లలకు బుధవారం ఎన్నారై ముత్యాల రామయ్య నిత్యావసర సరుకులు 100 కిట్లను పంపిణీ చేశారు. నగరంలోని మామిళ్లగూడెంలో ఉన్న థెరిస్సా మానసిక వికలాంగులకు నిత్యావసర సరుకులతో పాటుగా రగ్గులు, ఇతర వస్తు సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల విమలదేవి, ఎన్నారై వనజ కుమారి, నాగేశ్వరరావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

☞ ఖమ్మంమామిళ్లగూడెం: మున్నేరు, ఆకేరు వరద బాధితులకు ఖమ్మం జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన వంట పాత్రలు, బెడ్ షీట్లు, చీరలు, ఇతర దుస్తులు పంపిణీ చేశారు. బుధవారం ధంసలాపురం గ్రామంలో 50 మందికి, ఏదులాపురం గ్రామంలో 40 మందికి, తనగంపాడు, ఖమ్మంరూరల్ మండలంలో వంద మందికి కలిపి సుమారు రూ.1.25 లక్షల విలువైన సామగ్రిని అందజేశారు. జిల్లా చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, కార్యదర్శి జి.సూర్యప్రకాష్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు సాధినేని జనార్దన్‌రావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

☞ ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేట, జలగంనగర్, రాజీవ్‌గృహకల్ప, తీర్థాలలోని ప్రభుత్వ పాఠశాలల వరద బాధిత విద్యార్థులకు బుధవారం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన బట్టలు, బియ్యం పంపిణీ చేశారు. అదే విధంగా గ్లోరియస్ కింగ్ మినిస్ట్రీస్ వారు ప్లేట్లు, గ్లాసులు అందించారు. ఈ కార్యక్రమంలో జలగంనగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్యాంసన్, సంస్థ అధ్యక్షుడు బిషప్ జాకబ్, శ్రీవేణు, పుల్లారావు, రెడ్డి రమేష్, పాస్టర్ యోహాన్, ఎంఈఓ శ్రీనివాస్, సీఎంఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

☞ ఖమ్మంవన్‌టౌన్: ఐఎన్‌టీయూసీ (ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) జిల్లా కమిటీ ఆధ్వర్యాన బుధవారం మున్నేరు వరద బాధితులైన హమాలీలు, ఆటోడ్రైవర్లు సుమారు 35 మంది కార్మికులకు నిత్యావసర వస్తువులను జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగాధాం, పమ్మి వెంకటేశ్వర్లు, ఎండీ పాషా,నరేష్ మోహన్‌నాయుడు, పాల్వంచ క్రిష్ణ, ఫజల్, సత్తార్, భద్రం తదితరులున్నారు.

☞ తిరుమలాయపాలెం: వరదలతో తీవ్రంగా నష్టపోయిన రాకాసితండా వరద బాధితులకు తిరుమలాయపాలెం హోలీ స్పిరిట్ సిస్టర్లు, చర్చి ఫాదర్ గుడిబండ్ల రమేష్‌లు బుధవారం ప్లేట్లు, గ్లాసులు, బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. సిస్టర్లు దీపా, సుధా , రూన్సీ, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

☞ నేలకొండపల్లి: నేలకొండపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ చైర్మన్, బుద్ధారం గ్రామానికి చెందిన గురవయ్య మున్నేరు వరద బాధితులకు 65 చీరలు, రెండు బ్యాగులను జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర్‌శర్మకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అందించారు. అదే విధంగా స్థానిక గ్రామపంచాయతీ సిబ్బంది రూ.4,500 నగదు, 35 చీరలు గ్రామస్తుల నుంచి సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్నేరు వరద బాధితుల సహాయార్థం నిరుద్యోగ కళాకారులు తమ ఆటపాటలతో సందడి చేస్తూ విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల సంఘం ప్రతినిధి పెద్దపాక విజయ్, కళాకారులు పాతకోటి నరసింహారావు, పి.రాము, పుల్లారావు, పుల్లయ్య, గురవయ్య, నాగేశ్వరరావు, లక్ష్మీకాంతం, లలిత, విజయ్, వంశీ, పేరాల నగష్, నరసింహారావు, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంమయూరిసెంటర్: రగ్గులు అందిస్తున్న ఎన్నారై ముత్యాల రామయ్య



ఖమ్మంమామిళ్లగూడెం: వంట పాత్రలు, దుస్తులు అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు



ఖమ్మంరూరల్: విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న గ్రేస్ సర్వీస్ సొసైటీ సభ్యులు



ఖమ్మంవన్‌టౌన్: నిత్యావసరాలు అందిస్తున్న యూనియన్ నాయకులు



తిరుమలాయపాలెం: ప్లేట్లు, గ్లాసులు, పండ్లు అందిస్తున్న ఫాదర్ రమేష్, తదితరులు



నేలకొండపల్లిలో విరాళాలు సేకరిస్తున్న కళాకారులు

అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: నగరంలోని చెరువులు, కుంటలు, నాళాలపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్ర ఉపేంద్ర సాహు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం నగరంలోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లకారం చెరువుతో పాటు ధంసలాపురం, ఖానాపురం చెరువులు, కుంటలు, నాళాలు, అలుగులపై అక్రమ కట్టడాలు వెలిసి ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లల్లోని వరద నీరు చేరిందన్నారు. ఈ ప్రాంతంలో మొత్తం పేద ప్రజలే కాబట్టి ప్రభుత్వం అందించే రూ.16,500 బదులు ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని, ఇళ్లు కోల్పోయిన వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు మెమోరాండం అందించారు. జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ ఎం. పుల్లయ్య, అయితగాని శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లెపోగు విజయ్‌లతో పాటు బి.ఉపేందర్, దారెల్లి రమేష్, ఆదూరి కోటయ్య, గంజాయి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..



నిరసనలో యూటీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల గురుకుల పాఠశాలల్లో బుధవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు తెలిపారు. సమస్యల సాధన కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని గురుకుల పాఠశాలల్లో గురువారం నిరసనలు వ్యక్తం చేస్తామని, ఈ నెల 22, 23 తేదీల్లో కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలకు మెమోరాండాలు అందిస్తామన్నారు. అయినా సమస్యలు పరిష్కారం కాకపోతే 28న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమాల్లో యూటీఎఫ్ నాయకులు మహేష్, దామోదర్, సుధాకర్, ప్రసాద్, భవాని, ప్రసాద్, నరసయ్య, వీరస్వామి, సుభాషిని ,నాగమణి, రాజు ,జితేంద్రలు పాల్గొన్నారు.

డీఎంఏ విద్యార్థుల నిరసన..

ప్రతీ జిల్లాలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం కొన్ని కళాశాలలకు ప్రైవేట్ యూనివర్సిటీ హోదాను యూజీసీ కల్పించడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్లు రాయల సతీష్‌బాబు, ఈగా భరణీకుమార్‌లు మాట్లాడుతూ.. విద్యార్థులకు న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

● ఇక 'పూర్వ' వైభవమే..



నాడు వెంకటేశ్వరనగర్‌లోని ఓ వీధి(ఫైల్)



నేడు పరిశుభ్రంగా మారిన కాలనీ

మున్నేరు వరదలతో పరీవాహక ప్రాంతాలు నీట మునిగాయి. చెత్తాచెదారం చేరి వీధులన్నీ బురదమయమయ్యాయి. ఈక్రమంలో 5వ తేదీన వరద తగ్గిన అనంతరం వెంకటేశ్వర నగర్ కాలనీలో బురద పేరుకుపోగా.. బట్టలన్నీ ఆరేసి, ఆరుబయటనే దుస్తులను ఉతుక్కుని నాడు అలా కనబడింది. కానీ నేడు ఆ పరిస్థితులన్నీ మారిపోయి పూర్వస్థితికి చేరుకుని ఇలా శుభ్రంగా మారింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్